గతేడాది మార్చిలో మత్తడి దుంకుతున్న పెద్ద చెరువు

ప్రస్తుతం ఇలా..

నాడు నిండుకుండ.. నేడు వెలవెల

ప్రస్తుతం గ్రామాల్లో నెలకొన్న కరువు పరిస్థితులకు తిమ్మాపూర్ మండలం మన్నెంపెల్లి ఊర పెద్ద చెరువు నిదర్శనంగా నిలుస్తున్నది. నీరుడు మార్చిలో మిడ్ మానేరు కుడికాలువ ద్వారా తోటపల్లి రిజర్వాయర్ నుంచి వచ్చిన నీటితో నిండుకుండను తలపించిన ఈ జల వనరు.. నేడు వెలవెలబోతున్నది. దీంతో పంటలు వేసిన సమీప ప్రాంతాల రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతున్నది. **–తిమ్మాపూర్, మార్చి 26**

ఆటో డ్రైవర్ల సమస్యలపై పోరాడుతాం

- మాజీ ఎంపీ వినోద్‌కుమార్

మానకొండూర్:మాట్లాడుతున్న మాజీ ఎంపీ వినోద్‌కుమార్

మానకొండూర్, మార్చి 26: ఆటో డ్రైవర్ల సమస్యలపై పోరాడుతామని మాజీ ఎంపీ వినోద్‌కుమార్ పేర్కొన్నారు. మంగళవారం మానకొండూర్‌లోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో ఆటో యూనియన్ నాయకులు, డ్రైవర్లతో ఏర్పాటు చేసిన సమావేశానికి వినోద్‌కుమార్ హాజరై మాట్లాడారు. ఆటోడ్రైవర్ల సంక్షేమానికి గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఎంతో కృషిచేసిందని గుర్తు చేశారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో ఆటో యూనియన్ నాయకులు, డ్రైవర్లు తన గెలుపునకు కృషిచేయాలని కోరారు. బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ తుల ఉమ, బీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి రూప్‌సింగ్, రాష్ట్ర నాయకుడు గెల్లు శ్రీనివాస్, ఆటో యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలకు హాజరు

గంగాధర, మార్చి 26 : గర్శకుర్తి గ్రామంలో నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలకు మంగళవారం బీఆర్‌ఎస్ కరీంనగర్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఆయనకు సాదర స్వాగతం పలికారు. వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వేదపండితులు వినోద్ కుమార్‌ను సన్మానించి, ఆశీర్వచనాలు అందజేశారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

మండలంలోని ఆచంపల్లి గ్రామానికి చెందిన రుద్ర భూమయ్య ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబాన్ని మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ పరామర్శించారు. భూమయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మృతికి కారణాలు అడిగి తెలుసుకున్నారు. ఇక్కడ నాయకులు సాగి మహిపాల్‌రావు, మేచినేని నవీన్‌రావు, ఆకుల మధుసూదన్, కంకణాల విజేందర్ రెడ్డి, వేముల దామోదర్, అలువాల తిరుపతి, ద్యావ మధుసూదన్‌రెడ్డి, రామిడి సురేందర్, సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు

సైదాపూర్, మార్చి26: వెన్నంపల్లి ప్రసన్నాంజనేయ స్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వాస్తుపూజ చేశారు. భక్తులు పెద్దసంఖ్యలో హాజరై స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు.

నేడు వార్షిక మహాసభ

సైదాపూర్, మార్చి26: మండలకేంద్రంలోని వెన్కేపల్లి-సైదాపూర్ సింగిల్‌విండో కార్యాలయంలో బుధవారం వార్షిక మహాసభ నిర్వహిస్తున్నట్లు చైర్మన్ కొత్త తిరుపతి రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి పాలకవర్గ సభ్యులు, రైతులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

దరఖాస్తుల ఆహ్వానం

కమాన్‌చౌరస్తా, మార్చి 26: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకులాల సంస్థ, ట్రైబల్ సంక్షేమ గురుకులాల సంస్థ విద్యాలయాల్లో 2024-25 విద్యాసంవత్సరానికి 6, 7, 8, 9వ తరగతుల్లో మిగిలిన సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు టీఎస్ డబ్ల్యూఆర్‌ఈఐఎస్ ప్రాంతీయ సమన్వయాధికారి లక్ష్మాంజలి దేవి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అల్గునూర్‌లోని సీవోఈలో 9వ తరగతిలోకి మాత్రమే రెగ్యులర్ అడ్మిషన్లు ఉన్నట్లు తెలిపారు. వివరాలకు వెబ్‌సైట్ www.tswreis.ac.inలో చూడాలని పేర్కొన్నారు. ఆసక్తి గల విద్యార్థులు ఈనెల 30వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 21న ఉంటుందని వివరించారు.

ఎరువుల దుకాణాల తనిఖీ

చొప్పదండి, మార్చి26: మండలంలోని చొప్పదండి, రుక్మాపూర్, ఆర్నకొండ గ్రామాల్లో ఎరువుల విక్రయ దుకాణాలను మంగళవారం ఏవో వంశీ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా దుకాణాల్లో ఉన్న ఎరువుల నిల్వలు, స్టాక్ రిజిస్టర్‌ను పరిశీలించారు. వ్యవసాయ శాఖ సిబ్బంది ఉన్నారు.

ఎండిన పంటలకు పరిహారం చెల్లించాలి

- మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

మల్లాపూర్‌లో ఎండిపోయిన వరిపొలాన్ని పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే రవిశంకర్

గంగాధర, మార్చి 26 : సాగునీరు అందక ఎండిపోయిన పంటలకు ఎకరానికి రూ.25 వేల చొప్పున ప్రభుత్వం పరిహారం చెల్లించాలని మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ డిమాండ్ చేశారు. మండలంలోని మల్లాపూర్ గ్రామానికి చెందిన ఆకుల రాజయ్య అనే రైతు వేసిన నాలుగు ఎకరాల వరి పొలం ఎండిపోవడంతో మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, కేసీఆర్ పాలనలో వరద కాల్వ జీవనదిలా ఉండి వేలాది ఎకరాలకు సాగునీరు అందిందని గుర్తు చేశారు. మూడు నెలల క్రితం అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం పదేండ్ల కిందటి కరువు పరిస్థితిని తిరిగి తీసుకువచ్చిందన్నారు. ఎకరం పంట కూడా ఎండి పోకుండా సాగునీరు అందజేయడానికి ప్రభుత్వం బాధ్యత తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇక్కడ గంగాధర సింగిల్ విండో చైర్మన్ దూలం బాలాగౌడ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సాగి మహిపాల్‌రావు, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు మేచినేని నవీన్‌రావు, నాయకులు ఆకుల శంకరయ్య, నాగారపు సత్యనారాయణ, ముక్కెర మల్లేశం, తూం మల్లారెడ్డి, మల్లయ్య, ప్రశాంత్, రైతులు ఉన్నారు.

భూఆక్రమణ కేసులో మాజీ సర్పంచ్ అరెస్ట్

రాంనగర్, మార్చి 26: నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి భూమిని ఆక్రమించడంతో పాటు యజమానిని బెదిరింపులకు గురి చేసిన చింతకుంట మాజీ సర్పంచ్, కాంగ్రెస్ నాయకుడు పిట్టల రవీందర్‌తో పాటు మరో ముగ్గురిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌లోని మాదాపూర్‌లో నివాసం ఉండే పాంరాజ్ దేవిదాస్‌రావు తండ్రి గోవిందరావుకు 1954లో చింతకుంటలో సర్వే నంబర్ 106లో ఐదెకరాల 8 గుంటల భూమి ఉండేది. అందులో 20 గుంటలు ఉంచుకొని, మిగతా భూమిని విక్రయించారు. ధరణిలో గోవిందరావు పేరు వచ్చినా పహాణీలో చిన్న వీరయ్య అనే వ్యక్తి పేరు ఉన్నట్లు బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్నాడు. విషయం తెలుసుకున్న అప్పటి సర్పంచ్ పిట్టల రవీందర్ అప్పటి తహసీల్దార్ మోహన్‌రెడ్డితో కుమ్మక్కై తప్పుడు విరాసత్ ద్వారా న్యాలమడుగు రాజయ్య అనే వ్యక్తి పేరిట నకిలీ డాక్యుమెంట్లు తయారు చేయించాడు. రాజయ్య నుంచి గడ్డం ఆదిరెడ్డి పేరిట 2009లో రిజిస్ట్రేషన్ చేయించాడు. ఆదిరెడ్డి నుంచి 2010లో పిట్టల రవీందర్ పేరిట రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. సదరు భూమి తనదేనని బెదిరింపులకు గురిచేస్తున్నాడని దేవిదాస్‌రావు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. విచారణ జరిపిన పోలీసులు తహసీల్దార్ మోహన్‌రెడ్డి సహా పిట్టల రవీందర్, గడ్డం ఆదిరెడ్డి, న్యాలమడుగు రాజయ్యపై కేసు నమోదు చేశారు. కాగా, పిట్టల రవీందర్‌ను మంగళవారం అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి రిమాండ్ విధించగా, జిల్లా జైలుకు తరలించారు.

గడువులోగా అనుమతులివ్వాలి

- కలెక్టర్ పమేలా సత్పతి
- పోలింగ్ సిబ్బందికి మొదటి విడుత ర్యాండమైజేషన్ కార్యక్రమం

మాట్లాడుతున్న కలెక్టర్ పమేలా సత్పతి

కలెక్టరేట్, మార్చి 26: రాజకీయ పార్టీల ప్రచారానికి సంబంధించిన అనుమతులు నిర్దిష్ట గడువులోగా మంజూరు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పమేలా సత్పతి స్పష్టం చేశారు. నగరంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంగళవారం పోలింగ్ సిబ్బందికి నిర్వహించిన మొదటి విడుత ర్యాండమైజేషన్ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. పోలింగ్ సిబ్బంది కేటాయింపునకు సంబంధించిన వివరాలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల ప్రచారం, సభలు, సమావేశాలు, ర్యాలీలు, ఇతరత్రా కార్యక్రమాలు నిర్వహించుకునేందుకు సువిధ యాప్ ద్వారా మాత్రమే అనుమతి కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. సువిధ కింద రాని అనుమతులపై సంబంధిత అధికారులను సంప్రదించాలని, ఎన్నికల కోడ్‌ను అధికారులు పకడ్బందీగా అమలు చేయాలన్నారు. ప్రతి ఉద్యోగి అప్రమత్తంగా విధులు నిర్వహించాలని, కోడ్ ఉల్లంఘనపై వచ్చే ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి సారించి చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు ప్రఫుల్ దేశాయ్, లక్ష్మీకిరణ్, డీఆర్వో పవన్‌కుమార్, సీపీవో కొమురయ్య, డీపీవో రవీందర్, డీఐవో శివరాములు, ఎస్వో దత్తారెడ్డి, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఐక్యంగా సమస్యలను పరిష్కరించుకుందాం

రాష్ట్ర అధ్యక్షుడిని సన్మానిస్తున్న ఆర్‌ఎంపీ, పీఎంపీ నాయకులు

హుజూరాబాద్ టౌన్, మార్చి 26: అందరం ఐక్యంగా ముందుకు సాగి సమస్యలను పరిష్కరించుకుందామని ఆర్‌ఎంపీ, పీఎంపీల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కూచన సమ్మయ్య పిలుపునిచ్చారు. మంగళవారం ఆయన రాష్ట్ర అధ్యక్షుడి హోదాలో మొదటిసారిగా హుజూరాబాద్‌కు రాగా, సంఘం మండలాధ్యక్షుడు పంజాల తిరుపతి గౌడ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సమ్మయ్య మాట్లాడుతూ, సంఘం సభ్యులందరికీ గుర్తింపు కార్డులు అందజేయనున్నామని తెలిపారు. త్వరలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా సంఘ సమావేశం నిర్వహిస్తామని చెప్పారు. ఆర్‌ఎంపీ, పీఎంపీలు డాక్టర్ అని సంబోధించుకోవద్దని, బోర్డులు, క్లినిక్‌లు ఏర్పాటు చేయవద్దని తెలిపారు. కేవలం ప్రథమ చికిత్స మాత్రమే అందించాలన్నారు. పేషెంట్‌లను ప్రభుత్వ హాస్పిటల్‌కు మాత్రమే రెఫర్ చేయాలని సూచించారు. క్వాలిఫైడ్ వైద్యులను గౌరవించాలని కోరారు. సెక్రటరీ సొల్లు మహేందర్, సంఘం నాయకులు మాధవ రెడ్డి, కూచన తిరుపతి, శ్రీనివాస్, సదానందం, దేవేందర్, మహేశ్, రమేశ్, భాస్కర్, నాగరాజు ప్రభాకర్, రాజు, అనిల్ కుమార్ పాల్గొన్నారు.

ఎస్సారార్‌లో వర్క్‌షాప్

కమాన్‌చౌరస్తా, మార్చి 26: జిల్లా కేంద్రంలోని ఎస్సారార్ కళాశాలలో 'ఇంపార్టెంట్స్ ఆఫ్ రీసర్చ్ అండ్ కెరీర్ గైడెన్స్'పై కామర్స్ విభాగం ఆధ్వర్యంలో మంగళవారం వర్క్‌షాపు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని కన్వీనర్‌గా అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఏ సతీశ్‌కుమార్, సలహాదారుగా కామర్స్ విభాగం హెచ్‌వోడీ, వైస్ ప్రిన్సిపాల్ రాజయ్య వ్యవహరించారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రామకృష్ణ మాట్లాడుతూ, విద్యార్థులు పరిశోధనలపై దృష్టి సారించాలని సూచించారు. పాండిచ్చేరి సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ అమోలోక్ సింగ్ మాట్లాడుతూ, రీసెర్చ్ ప్రాముఖ్యతను వివరించారు. విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. సిద్దిపేట కళాశాల అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ గోపాల సుదర్శనం, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

అతిథులను సత్కరిస్తున్న ఎస్సారార్ ప్రిన్సిపాల్ రామకృష్ణ, తదితరులు

CHANGE OF NAME

★I, MENENEE SUJATHA R/o. 4-97, KONDAPUR, MEDIPALLY, JAGITYAL, TS. I have Changed My Name As MENNENI SUJATHA W/o. MENNENI PRABHAKAR RAO

NT-328851

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

వాగేశ్వరిలో ఫుడ్ ఫెస్టివల్

వంటకాలను పరిశీలిస్తున్న అతిథులు

కమాన్‌చౌరస్తా, మార్చి 26: జిల్లా కేంద్రంలోని వాగేశ్వరి డిగ్రీ, పీజీ కళాశాలలో మంగళవారం ఫుడ్ ఫెస్టివల్ అట్టహాసంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా మార్కెటింగ్ ఆఫీసర్ పద్మావతి, జిల్లా వెల్ఫేర్ ఆఫీసర్ సరస్వతి, మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ స్వరూపారాణి, శాతవాహన యూనివర్సిటీ ఫుడ్ సైన్స్ అసిస్టెంట్ ప్రొఫెసర్ జోసెఫ్ రాజు, కళాశాల చైర్మన్ బీవీఆర్ గోపాల్ రెడ్డి హాజరై విద్యార్థులు తయారు చేసిన వంటకాలను పరిశీలించారు. వాటి రుచి చూసి, విద్యార్థులను అభినందించారు. కళాశాల జాయింట్ సెక్రటరీ డాక్టర్ రత్న గోపాల్ రెడ్డి, ప్రిన్సిపాల్ సతీశ్ గౌడ్, లింగమూర్తి, వెంకట్ రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ చెన్నమల్ల చైతన్య, రమణ, ఏవో నిజామొద్దీన్, అధ్యాపకులు అరుణ్ కుమార్, వేణు తదితరులు పాల్గొన్నారు.

సీఎంని కలిసిన మున్నూరు కాపు సంఘం నాయకులు


సీఎం రేవంత్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న మున్నూరు కాపు సంఘం నాయకులు

విద్యానగర్, మార్చి 26 : సీఎం రేవంత్ రెడ్డిని టీపీసీసీ జనరల్ సెక్రటరీ సత్తు మల్లేశ్ పటేల్ ఆధ్వర్యంలో మున్నూరు కాపు సంఘం రాష్ట్ర నాయకుడు బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి, తదితరులు మంగళవారం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మున్నూరు కాపుల సమస్యలు పరిష్కరించాలని, జిల్లా కేంద్రంలోని సంఘం ట్రస్టు భవన నిర్మాణ అభివృద్ధి కోసం నిధులు మంజూరు చేయాలని వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో మున్నూరు కాపు సంఘం జిల్లా అధ్యక్షుడు బొమ్మ రాధాకృష్ణ పటేల్, ఈసీ మెంబర్, జూబ్లీహిల్స్ నియోజకవర్గ కోఆర్డినేటర్ వాసాల రాజు పటేల్, సంఘం రాష్ట్ర జాయింట్ సెక్రటరీ వాసాల వెంకటేశ్వర్లు పటేల్, నాయకులు మంగళారపు తిరుపతి పటేల్, వాసాల శ్రీనివాస్ పటేల్, వాసాల తిరుపతి పటేల్, శ్రీమూర్తి శ్రీనివాస్ పటేల్, బొమ్మ పవన్ కుమార్ పటేల్, వాసాల హరీశ్ పటేల్, మడం శివకాంత్ పటేల్, కర్ర రాజశేఖర్ పటేల్, చింతల కిషన్ పటేల్, మహిపాల్ పటేల్, కోల అన్నారెడ్డి తదితరులున్నారు.

నలుగురిపై కేసు

రాంనగర్, మార్చి 26: నగరంలోని తీగలగుట్టపల్లిలో గల కార్తీకేయనగర్‌లో నకిలీ పత్రాలు సృష్టించి భూమిని కాజేసేందుకు యత్నించిన కేసులో కరీంనగర్‌కు చెందిన తిరుపతి విష్ణువర్ధన్, కొమ్ము భూమయ్య, మంద నగేశ్, తిరుపతి నితిన్ వర్ధన్‌పై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. చొప్పదండి మండలం వెదురుగట్ట గ్రామానికి చెందిన పంబాల శ్రీనివాస్ ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. ఈ కేసులో తిరుపతి విష్ణువర్ధన్, మంద నగేశ్‌ను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. 14 రోజుల రిమాండ్ విధించగా జిల్లా జైలుకు తరలించారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో ఏడుగురికి జైలు

రాంనగర్, మార్చి 26: కమిషనరేట్ పరిధిలో మద్యం తాగి వాహనాలు నడిపి పట్టుబడిన 20 మందిని ట్రాఫిక్ పోలీసులు మంగళవారం మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపరుచగా ఏడుగురికి 3 రోజుల జైలు, రూ.16 వేలు జరిమానా విధించారు. 12 మందికి రూ.17 వేలు జరిమానా విధించగా, ఓ బాలుడికి రూ.3 వేల జరిమానా విధించారు. నగరంలో రోజూ డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు చేపడుతున్నట్లు ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కరీముల్లా ఖాన్ తెలిపారు.

లయన్స్‌క్లబ్ జిల్లా ఉపగవర్నర్‌గా భద్రేశం

చొప్పదండి, మార్చి 26: లయన్స్‌క్లబ్ జిల్లా 320జీ రెండో ఉప గవర్నర్‌గా చొప్పదండి లయన్స్‌క్లబ్ సభ్యుడు, జిల్లా అదనపు కార్యదర్శి లయన్ మోర భద్రేశం ఎన్నికయ్యారు. కరీంనగర్‌లో జరిగిన 8వ జిల్లా వార్షిక సమావేశంలో 2024-25 సంవత్సరానికి ఎన్నికలు నిర్వహించగా, 320జీ పరిధిలోని 103 క్లబ్‌ల నుంచి వచ్చిన సభ్యులు ఓటు వేసి భద్రేశంను భారీ మెజార్టీతో గెలిపించారు. తనపై నమ్మకంతో ఉప గవర్నర్‌గా గెలిపించిన 103క్లబ్ సభ్యులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఉపగవర్నర్‌గా ఎన్నికైన భద్రేశంను లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు మహేశుని మల్లేశం, సెక్రటరీ దూస రాము, కోశాధికారి మామిడి రాజేశ్ పవార్, క్యాబినెట్ సభ్యులు కొల్లూరి ఆనందం, జిల్లా కోఆర్డినేటర్ వల్లాల కృష్ణహరి, పెద్ది లక్ష్మీకాంతం, తాటికొండ శ్రీనివాస్, కొల్లూరి జితేందర్, జిల్లా చైర్‌పర్సన్ చింతల రవి, తొడుపునూరి లక్ష్మయ్య, నలుమాచు సుధాకర్, గొల్లపల్లి నరేశ్, తొడుపునూరి సత్యనారాయణ, అనంతరెడ్డి, సిరిపురం రాజు, తాటిపల్లి శివ అభినందించారు.

సంపద వనాల సందర్శన

శంకరపట్నం, మార్చి 26: తాడికల్ గ్రామంలోని సంపద వనాలను మంగళవారం ఎఫ్‌ఆర్‌వో రాజేశ్వర్‌రావు సందర్శించారు. ఈ సందర్భంగా వనంలో పెంచుతున్న పండ్ల మొక్కలు, రకాలు తదితర అంశాలను పరిశీలించారు. రికార్డులను తనిఖీ చేశారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఇక్కడ ఎంపీడీవో శ్రీవాణి, పంచాయతీరాజ్ ఏఈ తిరుపతి, ఏపీవో శారద, బీట్ అధికారి ఖాజా మొయినొద్దీన్, ఇరిగేషన్ ఏఈలు రమేశ్, అస్మ, పంచాయతీ కార్యదర్శి సమ్మ రాజేశ్వర్, టీఏ అశోక్, ఎఫ్‌ఏ సత్యనారాయణ, ఈజీఎస్, పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

ఇంటింటికీ అక్షింతల పంపిణీ

రామడుగు (చొప్పదండి), మార్చి26: రామడుగు మండలం వెలిచాల లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో నిర్వహించిన బ్రహ్మోత్సవాల్లో స్వామివారి సన్నిధిలో పూజించిన అక్షింతలు, స్వామి వారి చిత్రపటాలు, ప్రసాదం పంపిణీ కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా రామడుగు సింగిల్‌విండో చైర్మన్ వీర్ల వెంకటేశ్వర్‌రావు మాట్లాడుతూ, గ్రామంలోని ఇంటింటికీ లక్ష్మీనరసింహస్వామి అక్షింతలు, చిత్రపటం, ప్రసాదాన్ని అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వీర్ల సరోజన-ప్రభాకర రావు తదితరులు పాల్గొన్నారు.

భూవిక్రయంలో మోసగించిన ఐదుగురిపై కేసు

రాంనగర్, మార్చి 26: తప్పుడు పత్రాలు సృష్టించి ఒకే భూమిని పలువురికి అమ్మి మోసం చేసిన ఘటనలో 7వ డివిజన్ కార్పొరేటర్ భర్త ఆకుల ప్రకాశ్ సహా ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. కరీంనగర్ రూరల్ మండలం వల్లంపహాడ్‌లోని భూమి విషయమై తిమ్మాపూర్ మండలం మొగిలిపాలెంకు చెందిన వంతడపుల సంపత్ ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. ఆకుల ప్రకాశ్‌ను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరుచగా, 14 రోజుల రిమాండ్ విధించగా, జిల్లా జైలుకు తరలించారు.

మజ్జిగ ప్యాకెట్ల పంపిణీ

తెలంగాణచౌక్, మార్చి 26: ఆర్టీసీ ఎండీ సజ్జనార్ ఆదేశాల మేరకు బస్టాండ్ ఆవరణలోని డిపో-1లో పని చేస్తున్న డ్రైవర్లు, కండక్టర్లు, ఇతర సిబ్బందికి మేనేజర్ మల్లేశం బుధవారం మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డీఎం మాట్లాడుతూ, వేసవిలో డ్రైవర్లు, కండక్టర్లు జాగ్రత్తలు పాటించాలన్నారు. కార్యక్రమంలో డిపో-1 సిబ్బంది పాల్గొన్నారు.

స్వధార్ హోం సందర్శన

కలెక్టరేట్, మార్చి 26: నగరంలోని ప్రభుత్వ వృద్ధులు, దివ్యాంగుల వసతి గృహం, స్వధార్ హోంను జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్ మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆశ్రమంలోని సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. వృద్ధులు, దివ్యాంగులు, స్వధార్ హోం బాధితులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ తణుకు మహేశ్, తదితరులు పాల్గొన్నారు.

కోర్టు వివాదంలో ఉన్న స్థలంలోని చెట్ల నరికివేత

చిగురుమామిడి, మార్చి 26: మండల పరిధిలోని ఇందుర్తి గ్రామ రెవెన్యూ సర్వేనంబర్ 936లో గల రెండు ఎకరాల ముస్లిం స్మశాన వాటికకు సంబంధించిన భూవివాదం హైకోర్టులో పెండింగ్‌లో ఉండగా, సదరు స్థలంలోని చెట్లను కొందరు అక్రమంగా నరికి, విక్రయించుకున్నారని ఇందుర్తి మహ్మదీయా మసీద్ కమిటీ సభ్యులు ఆరోపించారు. ఈ విషయమై 20 రోజుల క్రితం తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశామని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని తాత్కాలిక మసీద్ కమిటీ సభ్యులు షేక్ సిరాజ్ పాషా, ఎండీ ఉస్మాన్ బాషా షేక్. ఇక్బాల్ షేక్, అఫ్సర్ షేక్, ఉమర్, ఎండీ షంషేర్ అలీ, ఎండీ బషీర్, ఎండీ చాన్, ఖురేషి, షేక్ చాంద్ పాషా కోరారు. ఈ విషయంపై తహసీల్దార్ నరేందర్‌ను వివరణ కోరగా, ఘటనపై రెండు రోజుల్లో పూర్తిస్థాయిలో విచారణ జరిపించి, బాధ్యులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

తెలంగాణచౌక్, మార్చి 26: బ్రాహ్మణులకు కార్పొరేషన్ ఏర్పాటు చేసి ఆదుకోవాలని భారతీయ బ్రాహ్మణ ఫెడరేషన్ ప్రెసిడెంట్ శ్రీరాంభట్ల దీపక్ బాబు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నగరంలోని సంఘ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. బ్రాహ్మణ ఫెడరేషన్‌ను కార్పొరేషన్‌గా మార్చాలని కోరారు.

కనుల పండువగా లక్ష్మీనర్సింహస్వామి కల్యాణం


లక్ష్మీనర్సింహస్వామి కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

కరీంనగర్ రూరల్, మార్చి 26: గోపాల్‌పూర్‌లోని తాపాల లక్ష్మీనర్సింహస్వామి ఆలయ వార్షికోత్సవంలో భాగంగా మంగళవారం స్వామి వారి కల్యాణాన్ని అర్చకుడు చిగురురాళ్ల మధుసూదనాచార్యులు ఆధ్వర్యంలో కనుల పండువగా నిర్వహించారు. స్వామి వారిని నాయకులు పురుమల్ల శ్రీనివాస్, ఊరడి మల్లారెడ్డి, వైస్ ఎంపీపీ నారాయణ, దుర్శేడ్ సింగిల్ విండో మాజీ చైర్మన్ మంద రాజమల్లు, వైస్ చైర్మన్ గోనె నర్సయ్య, తదితరులు దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. పూజల్లో ఆలయ కమిటీ అధ్యక్షుడు దాడి సంపత్, ఉపాధ్యక్షుడు దాడి శ్రీనివాస్, సభ్యులు దాడి మోహన్, దాడి చంద్రయ్య, దాడి శ్రీనివాస్, రాజయ్య, రాములు, రవి, తిరుపతి పాల్గొన్నారు.

తెలంగాణ గ్రామీణ బ్యాంక్ శాఖ ప్రారంభం

బ్యాంక్ శాఖను ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్ శోభ

కొత్తపల్లి, మార్చి 26: మండలంలోని ఆసిఫ్‌నగర్‌లో ఏర్పాటు చేసిన తెలంగాణ గ్రామీణ బ్యాంక్ నూతన శాఖను మంగళవారం బ్యాంక్ చైర్‌పర్సన్ వై శోభ ప్రారంభించారు. బ్యాంక్ ప్రాంతీయాధికారి ప్రభుదాస్, అడిషనల్ డీఆర్డీవో సునీత, ల్యాండ్ లార్డ్ ఎండీ హసన్, మేనేజర్ దేవసేనారెడ్డి, క్యాషియర్ నాగరాజు, ఎస్‌ఎంవో సాయికృష్ణ, ఎస్‌ఎంబీ బీపీ రాజు, బ్యాంక్ సిబ్బంది భార్గవి, ప్రియాంక, శ్రవణ్, వినయ్‌కుమార్, రామ్‌తేజ పాల్గొన్నారు.

హోలీ వేడుకల్లో విషాదం

- రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకుల దుర్మరణం

రాంనగర్, మార్చి 26: నగరంలోని ఐటీ టవర్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీనగర్‌కాలనీలో నివాసముంటున్న మానకొండూర్ మండలం గద్దపాకకు చెందిన పానుగంటి కృష్ణవంశీ (24), పెద్దపల్లి జిల్లా కమాన్‌పూర్ మండలం రొంపికుంటకు చెందిన పాళ్ల శివకుమార్ (24) స్నేహితులు. వీరిద్దరు సోమవారం ఉదయం నుంచి కరీంనగర్‌లో పలు ప్రాంతాల్లో స్నేహితులతో కలిసి హోలీ వేడుకల్లో పాల్గొన్నారు. సాయంత్రం 6 గంటలకు జ్యోతినగర్‌లోని స్నేహితుడి ఇంటి నుంచి అల్గునూర్‌కు బైక్‌పై వెళ్తుండగా ఐటీ టవర్ వద్ద డివైడర్‌ను ఢీకొన్నారు. అక్కడే ఉన్న సైన్ బోర్డు స్తంభానికి తగలడంతో తీవ్ర గాయాలయ్యాయి. కృష్ణవంశీ అక్కడికక్కడే మృతి చెందగా, శివకుమార్‌ను అంబులెన్స్ లో దవాఖానకు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. కృష్ణవంశీ పారామిలటరీ ఉద్యోగం కోసం హైదరాబాద్‌లో శిక్షణ పొందుతుండగా, వారం క్రితమే కరీంనగర్ వచ్చాడు. శివకుమార్ ఎస్‌బీఐ క్రెడిట్ కార్డ్స్ సేల్స్ ఎగ్జిక్యూటివ్‌గా పని చేస్తున్నాడు. మృతుల కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు.